

కడియం ఆవలో ఇటీవల నేలకొరిగిన చేలను పరిశీలిస్తున్న నాయకులు



ముంచుకొస్తుందా : ఉప్పాడ కొత్తపల్లిలో ముందుకొస్తున్న సముద్రం

మొప్పుందా!

పొంచి ఉన్న తుఫాన్ ముప్పు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది.. కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ముప్పు తప్పదని..110 కిలో మీటర్ల వేగంతో దూసుకొస్తోందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడి మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం రాత్రి తీరం దాటే అవ కాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారీ నష్టాలు సంభవించే ప్రమా దం ఉందన్న హెచ్చరికలతో అధికారులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. సిబ్బందిని అలర్ట్ చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్‌లో ఉన్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 110 మందిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మం డలం తూరంగిలో ఉన్న హోప్‌ఐలాండ్ కాలనీకి తరలించినట్టు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.తీర గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. బీచ్ రోడ్డుకి చేర్చి ఉన్న గృహాలను సైతం ఖాళీ చేయించారు. తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు రూ.50 లక్షలు కేటాయించారు.

విద్యుత్‌శాఖ సంసిద్ధం

ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల పర్యవేక్షణకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సీజీఎం, ఎస్ఈ, ఈఈ, డీఈఈలకు బాధ్యతలు అప్పగించారు. అత్య వసర సేవలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.పోల్స్ఇతర సామగ్రిని తుఫాన్ ప్రభావ జిల్లాలకు తరలించే పనిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

బీచ్ రోడ్డులో రాకపోకలు బంద్

తుఫాన్ హెచ్చరికలతో ఆదివారం సాయంత్రం నుంచి కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. బీచ్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు చేపట్టారు. వాహనాలు అటుగా వెళ్లకూడదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సముద్రస్నానానికి వెళ్లే భక్తులు బీచ్‌కు వెళ్లకూడదని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకార గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగం టాంటాం వేయించింది.

ఏజెన్సీలో అప్రమత్తం
పాపికొండల పర్యటన నిలుపుదల

దేవీపట్నం/రంపచోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా పాపికొండలు పర్యటన తాత్కాలికంగా నిలిపివేసినట్టు సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆదివారం తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా దేవీపట్నం మండలం పోశమ్మ గండి ఫెర్రీ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పర్యాటకులు,బోటు యాజమాన్యం, బోటు సిబ్బంది ఆదేశాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. రానున్న మూడురోజుల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉందన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 630772025, 08864-243561ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యా సంస్థలకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 28, 29 తేదీల్లో సెలవులు ప్రకటించారు.

- ఉమ్మడి జిల్లాలో రేపు అలజడి
- కాకినాడలో తీరం దాటే అవకాశం
- యంత్రాంగాలు అప్రమత్తం
- మూడు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- బీచ్‌కు రాకపోకలు బంద్
- స్కూళ్లు, కాలేజీలకు సెలవులు
- ఉద్యోగుల సెలవులు నిలుపుదల
- ఇళ్లకు తరలిన హాస్టల్ విద్యార్థులు
- ఏజెన్సీలోనూ అప్రమత్తం
- పాపికొండల పర్యటనకు బ్రేక్
- ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు



హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

బడులు బంద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కాకినాడ జిల్లాకు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు విద్యాశాఖాధికారులు సెలవులు ప్రకటించారు. కోనసీమ , తూర్పుగోదావరి జిల్లాలకు 27,28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోను తదుపరి సమాచారం ఇచ్చే వరకు పాఠశాలలను తెరవొద్దని ఆదేశించారు. ఉపవిద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులన్నీ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని పాఠశాలలను తుఫాన్ పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేస్తున్నారు.హాస్టళ్లలోని విద్యార్థులను ఇళ్లకు పంపేశారు.అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగులకు సెలవుల్లేవు..

ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. అతి పెద్ద తుఫాన్‌గా వాతావరణశాఖ హెచ్చరించడంతో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని, తుఫాన్ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, నష్ట నివారణ లేకుండా సన్నద్ధం కావాలని అధికారులు ఆదేశి స్తున్నారు. రానున్న నాలుగు రోజులూ ఎటువంటి సెలవులు ఉన్నా.. వాటిని రద్దు చేసుకుని విధులకు తప్పకుండా హాజరుకావాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశారు.

తుఫాన్ వస్తే ఏం చేయాలి..

- అధికారుల సమాచారం కోసం మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసర ఎస్ఎంఎస్‌లను చూడాలి. సమాచారాన్ని గుర్తించాలి. ప్రమాదకరంగా ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి.
- అధికారుల సూచనల ప్రకారం సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.
- పుకార్లు, వదంతులు నమ్మకూడదు.
- బయటకు వెళ్లకూడదు. ప్రమాదకర ప్రాంతాలకు అసలు వెళ్లకూడదు. పాతభవనాలు, చెట్లు, విద్యుత్‌వైర్లు వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- భారీవర్షాల సమయంలో ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ఆఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రిక్ గృహోపకరణాలను ప్లగ్ నుంచి తీసేయండి.
- మత్స్యకారులు వేటకు వెళ్లకూడదు.
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భవనాలపై సెల్ టవర్లు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అవి కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అనుమానం ఉంటే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి.
- అత్యవసర సహాయ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లను సంప్రదించాలి.

1996 తుఫాన్ తలచుకుని..

- భయపెడుతోన్న మొంథా
- ఆందోళనలో ప్రజానీకం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ భయపెడుతోంది. గోదావరి జిల్లాలను ముంచేస్తుందనే ఆందోళన మొదలైంది.1996 నవంబరు తుఫాన్ తలచుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం జోనల్, జిల్లాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. జోనల్ అధికారిగా ఐఏఎస్ అధికారి అజయ్‌జైన్, జిల్లా ప్రత్యేకాధికారిగా ఐఏఎస్ అధికారి కె.కన్నబాబును నియమించింది. మొంథా తుఫాన్ ఎదుర్కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో ఆయన తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు తెలియజేయాలన్నారు.అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి,నిత్యావసరాలు, మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా, సహాయక చర్యలపై యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలన్నారు.

జిల్లాలో రెడ్ అలర్ట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఎస్‌డీఎంఎ రెడ్ అలర్ట్‌ను ప్రకటించిందని.. జిల్లాలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ మేరకు ఆదివారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమ, మంగళవారాలు సెలవు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌ను ఈ వారం రద్దు చేసినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా డివిజన్ మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

నేడు వాతావరణంలో మార్పులు..

ఆదివారం వాతావరణం పొడిగా ఉండి,తుఫాన్ ముందు ప్రశాంతతను తలపించింది. గోపాలపురంలో మాత్రం కేవలం 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.మిగతా ప్రాంతాల్లో పొడిగా ఉంది. రాత్రి 7 గంటలకే వాతావరణంలో మార్పులు వచ్చి, స్వల్పంగా చలిగాలులు ఆరంభమయ్యాయి.సోమవారం నాటికి వాతావరణం మరింతగా మార్పులు వచ్చి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ హెచ్చరించింది. మంగళ, బుధవారాల్లో అతిభారీ వర్షాలు సంభవించే అవకాశం ఉన్నట్టు స్పష్టం చేసింది.భారీ వర్షాల వల్ల పల్లపు ప్రాంతాలు మునిగే అవకాశం ఉంది.

అట్టర్..ప్లాట్లు!

- అంచనాలు తలకిందులు
- అంతంతమాత్రమే స్పందన
- ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు
- మళ్లీ గడువు పొడిగించేనా?

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఇచ్చిన 90 రోజులు గడువు ముగిసింది. గతంలో అవకాశం ఇచ్చినా అర్ధంతరంగా నిలిపివేసింది. ఈ సారి పూర్తిస్థాయిలో 90రోజులు గడువిచ్చినా పథకానికి తొలినుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలోని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా), తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా), బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ అర్ధంతరంగా నిలిపివేసి దీనికి కొన్ని సవరణలు చేసి 2025, జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 134ను 2025, జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.ఆ గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.

మొక్కుబడిగానే దరఖాస్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడడంతో పాటు స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువిస్తూ అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కాకినాడ(కౌడా) పరిధిలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో 1,005 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకు వచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే ఉన్నాయి. ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అందరూ ముందుకు రాలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మళ్లీ గడువు పొడిగించేనా?

ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా.. గడువును పొడిగిస్తుందా.. అన్న సందేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్ల యజమానుల క్రమబద్ధీకరణకు వచ్చి ఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు జమయ్యే అవకాశం ఉండేదని అధికారులు అంటున్నారు.



ఏదీ.. ఏపీ స్టార్స్!

నేటికీ కదలని నిర్మాణం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ కబ్జా నుంచి ఓ భూమిని తెలివిగా కాపాడుకున్న జైళ్ల శాఖ అధికారులు ఆపై తుప్పలకు ధారాదత్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ఓ పెద్ద అకాడమీ ఎటుపోయిందో అనే ఆందోళన తుప్పల మాటున శిలాఫలకంగా ఉండిపోయింది. నిర్మాణం మాట అటుంచితే సంబంధిత ఫైలు ఉన్నతాధికారుల వద్ద నిద్రావస్థలో ఉంది. రెండేళ్ల కిందట జరిగిన తంతు కావడంతో స్థానిక అధికారులు దాదాపుగా ఆ విషయాన్ని మర్చిపోయారు. ఎవరైనా గుర్తు చేస్తే ఫైలు వెతకాల్సిన పరిస్థితికి 'ఏపీ స్టార్స్ అకాడమీ' నిర్మాణం చేరుకొంది.

ఏమిటీ అకాడమీ?

హోంశాఖ ఆధ్వర్యంలో జైళ్ల శాఖ కింద పనిచేసే ఓ చక్కటి శిక్షణ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కరణ సేవల శిక్షణ అకాడమీ (ఇంగ్లీషు పొడి అక్షరాల్లో ఏపీ స్టార్స్ అంటారు). జైళ్లలోని ఖైదీలను సంస్కరించే క్రమంలో సిబ్బంది, అధికారులు ఎంతో ఓర్పుతో నేర్పుగా పనిచేయాల్సిన పరిస్థితి ఉంటుంది. శిక్ష ద్వారా సంస్కరించడం లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో విధుల్లో మంచి ఫలితాలు సాధించే దిశగా అధికారులు, సిబ్బందిని తీర్చిదిద్దడానికి ఏపీ స్టార్స్ అకాడమీని నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ అధికారులు, సిబ్బందికి విధుల్లో సేవాభావం, ఆయుధాలు లేకపోయినా ఖైదీలను నియంత్రించడం, మానసిక పరిపక్వత, శారీరక దారుఢ్యం, ఒత్తిడిని జయించడం వంటి వాటిలో తర్ఫీదు ఇవ్వడం ఈ అకాడమీ ముఖ్యోద్దేశం. ఇన్‌డోర్, అవుట్‌డోర్ విభాగాలుగా ఫైరింగ్, కార్యాలయ సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్య శిక్షణ ఇస్తారు.

రూ.10 కోట్లతో 45 ఎకరాల్లో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఈ సంస్థ ఉండేది. రాష్ట్ర పునర్విభజన అనంతరం హైదరాబాద్ నుంచి 2015లో జీవో ఎంఎస్ నెం 121 ప్రకారం నెల్లూరులోని మూలాపేటలో ఉన్న పాత కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేశారు.సరిపడా స్థలం లేకపోవడంతో పూర్తి స్థాయిలో శిక్షణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జైళ్ల శాఖ కడప రేంజ్ పరిధిలో ఉన్న ఈ అకాడమీని రాజమహేంద్రవరానికి తరలించాలని.. పూర్తిస్థాయి భవన నిర్మాణాలు, రన్నింగ్ ట్రాక్ తదితర శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంకల్పించారు. కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ కార్యాలయం వెనుక ఉన్న 45 ఎకరాలను కేటాయించడంతో పాటు రూ.10 కోట్ల అంచనాతో పూర్తిస్థాయి నివేదికను జైళ్ల శాఖ డీజీకి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పంపించారు. దీంతో 2023 నవంబరు 15న అట్టహాసంగా శిలాఫలక ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒక్క ఇటుకను చేర్చలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చినా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో సంబంధిత ఫైలు జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో భద్రంగా నిద్దరోతోందని తెలుస్తోంది. దీంతో ఈ భూమిలో తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ ప్రదేశం డీఐజీ కార్యాలయం వెనుక ఉంటుంది. అయినా అకాడమీ విషయం జైళ్ల అధికారులు దాదాపుగా మరిచిపోయినట్టుగా పరిస్థితులు చెబుతున్నాయి.

తెరవెనుక నిజమిదే!

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి జిల్లాలోనూ ఒక వైసీపీ కార్యాలయాన్ని ఇంద్ర భవనానికి మించి నిర్మించాలని జగన్ సంకల్పించారు. ఆ పనులను రాష్ట్ర స్థాయి నేతల పర్యవేక్షణలో ఆయా జిల్లాల నాయకులకు అప్పగించారు. దీంతో స్థానిక నాయకుల కన్ను జైళ్ల శాఖకు చెందిన 50 ఎకరాలపై పడింది. అయితే రెండెకరాలు తీసుకుంటామని ప్రతిపాదించారు. దీంతో జైళ్ల శాఖ అధికారులు ఖంగుతిన్నారు. దీంతో అప్పటికప్పుడు ఏపీ స్టార్స్ అకాడమీ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చి ప్రభుత్వంతో మమ అనిపించుకొని శిలాఫలకం వేసేశారు. ఇలా వైసీపీ కబ్జా నుంచి ఆ భూమిని కాపాడుకున్న జైళ్ల శాఖ.. తర్వాత పట్టించుకోకుండా వదిలేసింది. సాక్షాత్తూ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ కార్యాలయం వెనుకన ఉన్న ఈ భూమి ఇటు అకా డమీ నిర్మాణానికి గానీ అటు ఏ అభివృద్ధి పనులకు గానీ నోచుకోవడం లేదు.ఈ అకాడమీ నిర్మాణం జరిగితే మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు రాజమహేంద్రవరం ఆశ్రయమిస్తుంది. ఎంతో కొంత మందికైనా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

- వైసీపీ నుంచి కాపాడుకొని నిర్లక్ష్యం
- రెండేళ్లు కావొస్తున్నా అతీగతీలేదు
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- అడుగు ముందుకు పడని వైనం
- పట్టింపులేని పాలకులు..
- మరిచిపోయిన అధికారులు
- శిక్షణ అందక జైలు సిబ్బంది ఇక్కట్లు



కొండచిలువ హల్‌చల్

సీతానగరం,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారీ కొండ చిలువ హల్‌చల్ చేసింది. గమనించిన ప్రజలు దానిని మట్టుబెట్టారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామంలోని కందుల పార్వతి ఇంటి పెరట్లో కర్రల కోసం ఒక వ్యక్తి వెళ్లాడు. కర్రలు తీస్తుండగా కొండచిలువ కనిపించింది. స్థానికులకు తెలపగా వారి అక్కడకు చేరుకుని 10 అడుగులు ఉన్న కొండచిలువను హతమార్చారు.గోదారి వరదలో కొట్టుకొచ్చి ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు.

మీ సేవలకు వందనం అన్నా..
ఎందుకమ్మా!

- 17న బదిలీ అయినా.. నేటికీ రిలీవ్ కాని వైనం
- 18న మరో ఐఏఎస్ నియామాకం
- సీటు వదలని స్పెషల్ కలెక్టర్ సరళావందనం
- ఇప్పటికీ ఇంట్లోనే పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్
- పలు ఆరోపణలతో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏం మతలబు ఉందో తెలియదు కానీ.. ప్రభుత్వం మీ సేవలకు వందనం అంటూ బదిలీ చేసినా ఆమె మాత్రం తన సీటు వదలడం లేదు.ఆమె సీట్లోకి మరో అధికారి వచ్చినా ఇంట్లో కూర్చునే ఇప్పటికీ ఫైల్స్ క్లియర్ చేయడం చర్చనీయాం శమవుతోంది. ఈ విషయమై రకరకాల ఆరోపణలు వినిపిస్తు న్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళే శ్వరం కేంద్రంగా ఉన్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎల్ఎఅండ్ ఆర్ఆర్ స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సత్తెనపల్లి సరళావందనంను ప్రభుత్వం ఈ నెల 17న బదిలీ చేసింది. పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించింది. అయితే ఆమె మాత్రం రిలీవ్ కాకుండా ఇంట్లోనే కూర్చుని పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తోంది. ఈ నెల 18న ధవళేశ్వరంలో పోలవరం ప్రాజెక్టు (ఎల్ఎఅండ్ ఆర్ఆర్) అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ (ఐఏఎస్)కు అదనపు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే బదిలీ అయిన సరళావందనం ఇంకా రిలీవ్ కాకుండా ఇంట్లోనే ఉండి అనేక ఫైళ్లను క్లియర్ చేస్తుండడం గమనార్హం. ఫైళ్ల క్లియరెన్స్‌కు కొద్దిరోజుల పాటు ఆమెకు సమయం ఇచ్చి నట్టు ఓ అధికారి చెబుతున్నారు. చాలా కాలంగా పెండింగ్ పెట్టి.. బదిలీ అయిన తర్వాత హడావిడిగా ఇంట్లోనే కూర్చుని పోలవరం భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత జనవరి లోనే ప్రభుత్వం నిధులు రిలీజ్ చేసింది. అవి చాలా కాలం లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరలేదు. ఇటీవల పునరావాస కాలనీల పునర్ని ర్మాణానికి కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సం గతి తెలిసిందే. ఆమె బదిలీ అయినా ఎందుకు రిలీవ్ కాలే దనేది ప్రశ్నార్థకంగా ఉంది.

పెద్దేవంలో ఆగని గేదెల మరణాలు

తాళ్లపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో గేదెలు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. అయినా అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం. నేటి వరకూ సుమారు 48 గేదెలు మృత్యువాతపడ్డాయి. గేదెలకు వైద్యం చేస్తున్నప్పటికీ శనివారం యండపల్లి నాగేశ్వరరావు, పోలినాటి శ్రీనివాసరావు, కేతవరపు సాయిరాంలకు చెందిన గేదెలు మృత్యువాతపడ్డాయి. గేదెలు ఎందుకు చనిపోతున్నా యన్నది నేటికీ తేలలేదు. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించా లని ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆదివారం డిమాండ్ చేశారు.



సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ



అన్నవరంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు, రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 3 గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. ఆదివారం సుమారు 5వేల జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో ఆలయంలో నిబంధనలను కఠినంగా అమలుచేశారు. పశ్చిమ రాజగోపురం వద్ద చిన్నద్వారాన్ని మూసివేశారు. సిబ్బంది తరుపున వచ్చినవారిని కూడా జనరల్ క్యూ లైన్ ద్వారానే అనుమతించారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం వెనక భాగంలో ఉండి దళారులు ఎవ్వరూ దరిచేరకుండా పర్యవేక్షణ చేశా రు. ఈవో సుబ్బారావు ప్రధానాలయం, వ్రతమండపాల వద్ద రద్దీ నియంత్రణకు ఆదేశాలిచ్చారు. వాహనాలను నిర్దేశితప్రాంతంలో మాత్రమే పా ర్కింగ్‌కు అనుమతించారు. సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా సుమారు 6వేల మందికి ఉచిత పులిహోర దద్దోజనం అందించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు రథంవెంట నడి చి స్వామిసేవలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో..



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఆది వారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి గణపవరానికి చెందిన కొండేటి వెంకటరత్నం రూ.30,116.. రాజమహేంద్రవరానికి చెందిన భూపతిరాజు సాయిశరత్‌వర్మ రూ. 36,500 విరాళాలు సమర్పించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ శ్రీరామ రాహుల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు అందించారు. వారికి అర్చక బృందం వేద మంత్రాలతో స్వాగతం పలకారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ దంపతులకు చిత్రపటం అందిస్తున్న డీసీ

30 రోజులు.. 100 ప్రసవాలు!

- రికార్డు సృష్టించిన చింతూరు ఏరియా ఆసుపత్రి
- వైద్యులను అభినందించిన ఐటీడీఏ పీవో

చింతూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో 100 ప్రసవాలతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని చింతూరు ఏరియా ఆసుపత్రి రికార్డు సృష్టించింది. దీంతో ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆదివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, గైనకాల జిస్టులు డాక్టర్ రమణా రావు, డాక్టర్ శశికళను అభినందించారు. మొన్నటి వరకు గర్భిణులకు ప్రసవ తీరులో కాసింత సమస్య ఉందంటే చాలు ఇక్కడ నుంచి తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించేవారు. ఈ క్రమంలో గర్భిణులతో సహా ఆయా కుటుంబాలు నానా అవస్థలు పడాల్సివచ్చేది. ఒక్కోసారి ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది. అంతేకాక పలు సందర్భాల్లో పరిస్థితి విషమించడం, అక్కడి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడం తదుపరి పేద, ఆదివాసీ కుటుంబాలు ఆసుపత్రుల బిల్లుల కోసం అప్పుల పాలైన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల చింతూరు ఆసుపత్రిని ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటుగా అదే దశలో ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి స్వయంగా అనస్థీసియా డాక్టర్ (మత్తు మందు వైద్యుడు) కావడం అదేదశలో ఇరువురు గైనకాల జిస్టులను ప్రభుత్వం నియమించడంతో ప్రసవ వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. అం తేకాకుండా ప్రసవాలకు తెలంగాణకు తరలించాల్సిన అవసరం దాదాపు లేకండా పోయింది. ఇటీవల ప్రసవాలపై ఆసుపత్రి సూప రింటెండెంట్ కోటిరెడ్డి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక ప్రత్యేక వసతులతో కూడిన నవజాతి శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటుచేయడం ఆ మేరకు ప్రత్యేక వైద్యనిపుణుడిని నియమించడంతో శిశుమరణాల సంఖ్య గణనీ యంగా తగ్గింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవ రిలో 64, ఫిబ్రవరి 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50, ఆగస్టు 92, సెప్టెంబరు 95, ఇక సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26 వరకు 30 రోజుల్లో 100 ప్రసవాల టార్గెట్‌ను సాధించి జిల్లా రికార్డును సొంతం చేసుకోవడంతో ఉన్నతాధికారుల నుంచి ఆసుప త్రి వైద్యులు,సిబ్బంది అభినందనలు అందుకున్నారు.



చింతూరు ఆసుపత్రిలో ప్రసవ మహిళల వార్డు



చింతూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగుళూరు ఇంటర్నేషనల్ టాలెంట్ బ్యాడ్మింటన్ టోర్నమెంటుకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఆదివారం ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ ఆసియా అసోసియేషన్, కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగుళూరులో ఈపోటీలు నిర్వహిస్తారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-1 నేషనల్ ఎంపైర్‌గా వ్యవహరిస్తున్న పాయసం శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మంగుళూరులో టోర్నమెంట్ ఈనెల28 నుంచి నవంబరు 2వరకు ఉరవ ఇండోర్ స్టేడియంలో జరుగుతుందన్నారు. న్యాయ నిర్ణేతగా మరోసారి నియమితులైన శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బాలు, కోనసీమ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణబాబు అభినందించారు.

సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాలి

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాంలో కవిసంధ్య దశాబ్ది ఉత్సవం



యానాంలో కవిసంధ్య ప్రత్యేక సంచికను అవిష్కరిస్తున్న అతిథులు

యానాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, కళ, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాల్సిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం యానాం అంబేడ్కర్ నగర్ కల్యాణమండపంలో కవిసంధ్య సాంస్కృతిక సంస్థ దశాబ్ది ఉత్సవం, శిఖామణి సాహిత్య పురస్కారాల ప్రదానం జరిగింది. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా మల్లాడి మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తారన్నారు. వారి రచనలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కొంతమంది ఇబ్బంది పడతారని, అటువంటి కవులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ముగ్గురు స్థానిక కవులకు, మరో ముగ్గులు ఆంధ్ర, తెలంగాణకు చెందిన కవులకు పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహాయం, అలాగే కవిసంధ్య కార్యక్రమాలను తోడ్పాటు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కవులు దాట్ల దేవదానం రాజు, వరుగు భాస్కరరెడ్డి, డానియల్ నెజర్స్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజు బాబా, కుంచే నాగసత్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా కవిసంధ్య-56 ఆరుద్ర బైరాగీ శత జయంతి సంచికను మల్లాడి కృష్ణారావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రచించిన సదా స్మరణీయులు సంచికను డెనియల్ నెజర్స్ ఆవిష్కరించారు.

సమాజం చైతన్యవంతానికి సాహిత్యం బాసట : ఇనాక్

సమాజం చైతన్యవంతంగా పురోగమించడానికి సాహిత్యం బాసటగా నిలుస్తుందని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శిఖామణి పదేళ్లుగా కవిసంధ్య పత్రికను ఒంటిచేత్తో విజయవంతంగా వెలువరించడం అభినందనీయమన్నారు. యానాంలో సాహిత్య, కళారంగాలకు మ ల్లాడి కృష్ణారావు సహకారం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. సాహితీపరంగా యా నాం మరింత పురోగతి సాధించగలదని ఆకాంక్షించారు. శిఖామణి తన మనమడు కోసం రాసిన కవితలు చదివానని, చిన్న పిల్లవాడిని అయ్యానని, శిఖామణి కవిత్వం అంతగా కదిలిస్తుందని తెలిపారు. ఈ సభ మంచి అనుభూతిని మిగిల్చిందన్నారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

సాహిత్యంలో జీవన సాఫల్యం కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు, అలాగే కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారాన్ని అవధానుల మణిబాబుకు మల్లాడి అందజేశారు. పూలమాలలు, శాలువా, మెమోంటో, సన్మానపత్రంలో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. సన్మాన గ్రహీతలు తమ స్పందన తెలిపారు.

పదిమందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం

వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళితసాహిత్యం తదితర అంశాల్లో పది మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఎస్.ఆర్.పృథ్వీ (దీర్ఘకవితలు), పీఆర్ఎల్‌స్వామి (కవిత్వధారణ), బీహెచ్‌వీ.మంగేష్ (పత్రికారంగం), పచ్చిమాల శివనాగరాజు (పద్య కవిత్వం), డాక్టర్ వరగు భాస్కరరెడ్డి (పరిశోధన), కోయి కోటేశ్వరరావు (దళిత సాహిత్య విమర్శ), పుష్పాల సూర్యకుమారి (నవల సాహిత్యం), పొనుగుమట్ల అశోక్‌కుమార్ (వచన కవిత్వం), పెనుమాక రత్నాకర్ (కథా సాహిత్యం), మిరప మహేష్ (వచనకవిత్వం)లకు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఇనాక్ సాహిత్యంపై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, అవధానుల మణిబాబు కవిత్వంపై డాక్టర్ కాళ్లకూరి శైలజ మాట్లాడారు. ఈ సందర్భంగా శిఖామణి మాట్లాడుతూ ప్రతీ ఏటా అందించే పురస్కారాలకు కమిటీ ద్వారా కవులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మల్లాడి కృష్ణారావు సౌజన్యంతో పురస్కారాలను ప్రదానం చేసినట్టు తెలిపారు. పదేళ్లుగా కవిసంధ్య పత్రికను ఎన్నో కష్టనష్టాలకోర్చి వెలువరిస్తున్నట్టు తెలిపారు. కవిసంధ్యకు అండగా నిలుస్తున్న మల్లాడికి కృతజ్ఞతలు తెలిపారు. కవులు మదునాపంతుల సత్యనారాయణమూర్తి, రచయితలు పాల్గొన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్

సఖినేటిపల్లి రేవులో రాకపోకల నిలిపివేత

అంతర్వేది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిపివేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలకు ఏ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పంటు ప్రయాణాలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. తుఫాను తీవ్రత న ఆధారంగా తదుపరి రాకపోకలు సమచారం ప్రయాణికులకుతెలియచేస్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



మరణించిన చిట్టెమ్మ

జగ్గంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రపాలెం గ్రామ శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే సాగరపేటకు చెందిన నక్క వెంకన్న తన భార్య చిట్టెమ్మ(42) కలిసి ఆదివారం ఉదయం గ్రామం నుంచి జగ్గంపేట పనికి వెళ్లారు. ముగించుకుని తిరిగి తమ మోటార్‌సైకిల్‌పై ఇంటికి వచ్చే క్రమంలో గుర్రప్పాలెం గ్రామ శివారున ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన చిట్టెమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మరణించినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలులో షష్టి ఉత్సవాలకు రాట ముహూర్తం

బిక్కవోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన సతీమణి మహాలక్ష్మితో కలిసి పందిరిరాట వేసి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే దంపతులు ముందుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం పందిరిరాట వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు చాళుక్యులు త్రిమందిర్ పేరుతో బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వర ఆలయాలు, గొల్లలమామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయాలను కేంద్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకంలో రూ.92.5 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 2 వరకూ షష్టి ఉత్సవాలు నిర్వహిస్తామని, నవంబరు 26న స్వామి వారి షష్టి ఉత్సవం జరుపుతామని షష్టి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రావాడ నాగు, ఇందల వీరబాబు, చాగంటి సాయిబాబారెడ్డి. బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, రెడ్డి నాగవేణికుమారి, నడింపల్లి సూర్యకుమారి, పడాల రాము, తనుకు శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.



బిక్కవోలులో షష్టి ఉత్సవాలకు రాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 36 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ పోటీలను ఆదివారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రౌండ్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మెన్, ఉమెన్ విభాగాల్లో జరిగిన పోటీల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ ప్రథమ స్థానంలో పిఠాపురం, ద్వితీయ స్థానంలో రాజమహేంద్రవరం, తృతీయ స్థానంలో కాకినాడ క్రీడాకారులు నిలిచారు. ప్రతిభ ఆధారంగా 36 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు నవంబరు 1, 2, 3న విజయవాడలో జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఏపీ ఇంటర్మీడియట్ నాన్ గెజిటెట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.సురేష్‌కుమార్, కె.పద్మనాభం, రమణ, చిన్నబ్బాయి బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా ముమ్మిడి గణేష్, జి.శివప్రసాద్,పి.పవన్ వ్యవహరించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఎద్దులు అక్రమంగా కబేళాకు తరలింపు

ఇద్దరి అరెస్ట్



వ్యాన్‌లో తరలిస్తున్న ఎద్దులు

రాయవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎద్దులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగ్గంపేట సంత నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి అక్కడి నుంచి ఐషర్ వ్యాన్‌లో నెల్లూరుకు అక్రమంగా 16 ఎద్దులు, 14 దూడలను తరలిస్తుండగా రాయవరం పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. రామచంద్రపురం శివారు కొత్తురుకు చెందిన సంసేను, రామచంద్రపురానికి చెందిన వెట్రివేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. టీఎన్ 66ఏబీ 8740 ఐషర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఎద్దులు, దూడలను సామర్లకోట గోశాలకు తరలించి వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

ఒడిసా టు కోయంబత్తూరు..

గంజాయి తరలిస్తుండగా పట్టివేత

రూ. 8 లక్షల విలువైన సరుకు స్వాధీనం

ఆటో, లారీ సీజ్... ముగ్గురిపై కేసు



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిసా ప్రాంతం నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తూర్పు గోదావరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య తెలిపారు. కొవ్వూరు గామన్ వంతెన దిగువన దొమ్మేరు రోడ్డులో ఆటో నుంచి లారీలోకి గంజాయి ఎక్కి స్తున్నారని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తీసుకువచ్చిన ఆటో, రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేసి 86 ప్యాకెట్లలో ఉన్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి డొంకరాయికి చెందిన ఆటోలో డ్రైవర్ గంజాయిని కొవ్వూరు తీసుకువచ్చాడు. ఇక్కడి నుంచి కోయంబత్తూరుకు తరలించేందుకు లారీలో ఎక్కిస్తుండగా డొంకరాయికి చెందిన ఆటో డ్రైవర్, తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డి.అప్పారావు, రవిశంకర్, ఐఎన్ఎస్.బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

తునిలో పోలీస్ కార్డన్ సెర్చ్

పత్రాలు లేని 23 బైక్‌ల స్వాధీనం

తునిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, సారా విక్రయాలు పెరిగిపోయాయని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాకినాడ జిల్లా తుని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 4 గంటల నుంచి 7గంటల వరకు పట్టణాన్ని జల్లెడ పట్టారు. సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ విజయ్‌బాబు, కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ, తుని టౌన్, రూరల్ పోలీసులతో పాటు కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ప్రధాన కూడళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 23 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.



తునిలో బైక్‌లను స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా బ్రాంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు



గోల్డెన్ జూబ్లీ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్రాంచి 50వ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం కాకినాడలోని కార్యాలయంలోని ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలషుల సమక్షంలో ప్రత్యేక సంచికను (సావనీర్) ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ ఆలీషా మాట్లాడుతూ సంఘం 50 వసంతాలు పూర్తి కావడం చాలా ఆనందం కలిగించిందన్నారు. ఉద్యోగి కాకపోయినా గౌరవంతో ఆహ్వానించినందుకు అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సేవలను విస్తరించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కా ర్య దర్శి సాలగ్రామ లక్ష్మి ప్రసన్న, టీడీపీ నాయకుడు మీసాల రాజు, చలపతి నాయుడు, కృపారత్నం, ఏటివోడీ అపర్ణ ప్ర సంగించారు. 50 ఏళ్లలో సంఘం సేవలను, కృషిని కొనియాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్ఎన్పి శాస్త్రీ, జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, జిల్లా ప్రధాన కార్యదర్శిటి నూకరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇబ్రహీం, సరోజిని రాష్ట్ర కార్యదర్శి షాజీదా హాజరయ్యారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైన సంఘం సాధించిన విజయాలను కార్యవర్గం సభకు తెలియజేసింది.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయండి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ విభాగ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు



నూతన ఉపాధ్యాయులను సత్కరించిన ఎస్టీయూ నాయకులు

దివాన్‌చెరువు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ విభాగ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు, మండలాధ్యక్షుడు బండి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం అన్నారు. మెగా డీఎస్సీలో ఎంపికై బాధ్యతలు నిర్వహిస్తున్న రాజానగరం మండలానికి చెందిన 12 మంది ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో అభినందన సత్కారం ఆదివారం జరిగింది. స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాల నెం2 లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులను ఆ మేరకు అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా వారందరినీ ఘనంగా సత్కరించారు. సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు సంఘం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డులు అందుకున్న అగ్నేశ్వరరావు, పవన్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రత్నరాజు, సూరిబాబు, శైలజభవాని, శోభారాణి, ఉదయలక్ష్మి, ప్రభాకరకుమార్, సత్తిరాజు పాల్గొన్నారు.

కడియపులంకలో రూ.65.60 లక్షల అవినీతి

పంచాయతీ కార్యదర్శులు ఇద్దరికి షోకాజ్‌లు

కడియం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కడియపులంక పంచాయతీలో రూ.65.60 లక్షల అవినీతి జరిగినట్టు పంచాయతీ అధికారులు గుర్తించారు. ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2021-23 సమయంలో వసూలైన వివిధ రకాల పన్నుల రూపంలో వచ్చిన సొమ్ములు, పలు అభివృద్ధి పనులకు విడుదలైన నిధులను తప్పుగా ఉపయోగించినట్టు వార్డు మెంబర్ ఫిర్యాదు మేరకు పంచాయతీ అధికారులు విచారణ నిర్వహించారు. రూ.65,60,000 ప్రజానిధులు అక్రమంగా వాడినట్టు అధికారులు దర్యాప్తులో గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా పంచాయతీ అధికారులు విచారణ జరిపారు. 2021-23 సమయంలో ఉన్న సర్పంచ్ చనిపోవడంతో కార్యదర్శులుగా పనిచేసిన విజయరాజు, కె.రాజశేఖర్ బాధ్యత వహించాలంటూ ఈనెల 18న షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కార్తీక వనసమారాధనలు

దివాన్‌చెరువు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం ప్రారంభంతోనే వన సమారాధనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం శ్రీలక్ష్మీగణపతి సంక్షేమ వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తోటలో వనసమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టుకు, లక్ష్మీనారాయణుడు, శివపార్వతులకు పూజలు చేసి అనంతరం భోజనాలు చేశారు. కార్యక్రమంలో బొల్లేపల్లి వీరపండు, గ్రంధి నానబ్బులు, అర్జునరావు, సత్తిబాబు, దాసరి శ్రీనివాసరావు, దుర్గారావు, కంకటాల మూర్తి పాల్గొన్నారు. అలాగే లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలోని గాంధీ పార్క్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. తొలుత కొంతమంది దంపతులు ఉసిరి చెట్టుకు పూజలు చేసి సత్యవ్రతాలు చేసుకున్నారు. అనంతరం భోజనాలు చేశారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వ్యాక్సినేషన్‌పై ఫార్మాసిస్ట్‌లకు శిక్షణ

కోరుకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫార్మసీ సదస్సు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్‌పై శిక్షణను అసోసియేషన్ వాక్సినేషన్ ప్రాజెక్ట్ అధికార ప్రతినిధులు డాక్టర్ రాజవైద్య, గోవా, కమ్యూనిటీ ఫార్మాసిస్ట్ మానసి జోషి, క్లినికల్ ఫార్మసీ టీచర్ ప్రాక్టీషనర్, వ్యాక్సినేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బోధకులకు శిక్షణ ఇచ్చారు. ఐదేళ్లుగా డాక్టర్ టీవీ నారాయణ, సౌత్ ఈస్ట్ ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ, ప్రెసిడెంట్, అంతర్జాతీయ ఫార్మసీ సదస్సు అధ్యక్షులతో జరిపిన చర్చలు, కృషి ఫలితంగా ఈ కార్యక్రమాన్ని భారతదేశానికి అధికారికంగా మంజూరు చేయించారు. శిక్షణ తీసుకున్న ఫార్మసిస్టులు, డాక్టర్లు, నర్సుల పర్యవేక్షణలో వ్యాక్సిన్ చేసేందుకు అర్హత పొందుతారు. శిక్షణ పొందిన వారికి యోగ్యత పత్రాలను డాక్టర్ రాజ్ వైద్యడాక్టర్ మానసిజోషి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ తన్నీరు చిన్న సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ టీవీ నారాయణ, సెక్రటరీ డాక్టర్ భరత్ వికాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.మురళీధర్, పి.వాసుబాబు,డాక్టర్ వి.సతీష్ కుమార్, డాక్టర్ మాధురి శ్రీకర్ పాల్గొన్నారు.

మూగమనసులు చిత్రం 60 వసంతాల వేడుక

సుబ్బారావు, జిత్‌మోహన్, ఎస్.మల్లికార్జునరావులకు అక్కినేని అవార్డులతో సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన నటించిన మూగమనసులు చిత్రం 60 వసంతాల వేడుకను స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం నిర్వహించారు. అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జిత్‌మోహన్ మిత్ర ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతీయ సినిమా పరిశ్రమలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, రాజమహేంద్రవరానికి చెందిన వారని అన్నారు. గోదావరి అందాలను తొలిసారిగా తెరకెక్కించిన ఘనత ఆదుర్తికే చెందుతుందని, అప్పటినుంచీ గోదావరి తీరంలో ఎన్నో చిత్రాలు నిర్మితమవుతున్నాయన్నారు. అనంతరం జిత్‌మోహన్, సుబ్బారావు, ఎస్.మల్లికార్జునరావులను అక్కినేని అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, గిరిజాల సోమరాజునాయుడు, ఏఎస్ ఆనంద్, కృష్ణ, సూర్యప్రకాశరావు, ఏకే దత్తాత్రేయ శర్మ, కె.రామ్మోహనరావు, సత్యకృష్ణ, రాఘవరావు పాల్గొన్నారు.

శెట్టిబలిజలు అన్నిరంగాల్లో ఎదగాలి

కార్తీక వన సమారాధనలో మంత్రులు సుభాష్, దుర్గేష్



సానబోయిన రామారావును సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజలు అన్నిరంగాల్లో ఎదగాలని మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్ అన్నారు.రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని చెరుకూరి తోటలో జరిగిన కార్తీక వన సమారాధన, ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలకు మంత్రులతోపాటు శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలో ఆదరణ పథకంలో గీత కార్మికులకు ఉపకరణాలు, కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర శెట్టిబలిజ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. శెట్టిబలిజల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సానబోయిన రామారావును ముఖ్యఅతిథులు సత్కరించారు. శెట్టిబలిజ సంఘానికి సేవలు చేస్తున్న10 మందికి స్మారక అవార్డులను ప్రదానం చేశారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

రాజమండ్రి కార్పొరేట్ క్రికెట్ కప్ సీజన్-3 ప్రారంభంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదపడతాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వాహకుడు బాలాజీ, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని నిలువెత్తు నిదర్శనంగా ఏఎస్పీ చెంచు రామయ్య అని అన్నారు. స్పాన్సర్ ప్రముఖ సినీ ప్రొడ్యూసర్ సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్‌వాట్ కొమ్ము మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో రాజకీయ రంగం నుంచి టీమ్ లేకపోవడం వెలితిగా ఉందన్నారు. వచ్చే టోర్నమెంట్‌లో డాక్టర్స్, పొలిటికల్ టీమ్‌లు పాల్గొనే ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, గురునాధం,డాక్టర్ కృష్ణతేజ, సాయి, కొండవీటి ప్రభాకర్, జామి సత్యనారాయణ బాలాజీ, సాయి పాల్గొన్నారు.

తెలుగు పాఠ్య పుస్తక రచయితగా శిరీషకుమారి



గోకవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పిట్టా శిరీషకుమారి రాష్ట్ర ప్రభుత్వ పాఠ్య పుస్తక రచయితగా ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈవో కె.వాసుదేవరావు నుంచి ఆదివారం తనకు ఉత్తర్వులు అందినట్టు శిరీషకుమారి తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 8మంది ఉపాధ్యాయులు వివిధ సబ్జెక్టుల రచయితలుగా ఎంపికవ్వగా గోకవరం మండలం నుంచి శిరీషకుమారి తెలుగు పాఠ్య పుస్తక రచయితగా ఎంపి కయ్యారు. ఈమె గతంలో 8వ తరగతి పాఠ్య పుస్తకం రూపొందించడంలో పని చేశారు. ఈ నెల 27 నుంచి నవంబరు 1 వరకు విజయవాడ ఎస్‌జే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరిగే వర్క్ షాప్‌లో ఈమె పాల్గొననున్నారు. శిరీషకుమారి ఎంపిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఇదేంటి సారూ!

- రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో హౌస్‌కీపింగ్ వర్కర్లకు అన్యాయం
- పీజీఆర్ఎస్‌లో మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
- లోపాయికార ఒప్పందంతో ఆటాడుకుంటున్న సెక్యూరిటీ గార్డ్స్ (కాంట్రాక్ట్)





రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో పనులు చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో హౌస్ కీపింగ్ పనులను 11 మంది మహిళలు 2017 నుంచి చేస్తున్నారు. కార్యాలయం ప్రారంభోత్సవం సమయంలో అప్పటి కమిషనర్ విజయరామరాజు ఆదేశాలతో 13 మంది మహిళలను కార్యాలయం శుభ్రం చేసేందుకు తీసుకున్నారు. ఈ పనులను కాంట్రాక్ట్ తీసుకున్న గుత్తేదారుడి ఆధీనంలో కార్పొరేషన్ కార్యాలయంలో హౌస్‌కీపింగ్ పనులు చేశారు. అటుపై మరో కాంట్రాక్టర్ ఆధీనంలో కొంతకాలం పనిచేశారు. ఇద్దరి ఆధీనంలో సుమారు ఏడేళ్ల పనిచేశారు. ఆరంభంలో నెలకు ఒక్కొక్కరి రూ.8,100 జీతం ఇచ్చేవారు. అటుపై కార్పొరేషన్‌లో సెక్యూరిటీ విధులు నిర్వహించే వారిలో ఓ వ్యక్తి ఈ హౌస్‌కీపింగ్ పనులు కాంట్రాక్టర్ నుంచి సబ్ లీజుకు తీసుకుని కోతలు మొదలెట్టారు. వారికి ఇష్టం లేని వారిని తీసేయడం, కొత్త వారిని తీసుకుని వారి నుంచి రూ.50 వేలు తీసుకోవడం వంటి పనులు చేసి అడ్డగోలుగా వ్యవహరించారు. ఇలా మూడేళ్లపాటు పనులు జరిగాయి. ప్రస్తుతం నెలకు ఒక్కో మహిళకు రూ.15 వేలు వస్తుంది. అందులో వివిధ రూపాల్లో కటింగ్‌లు చేసి రూ.9 వేలు ఇస్తున్నారు. అయితే హౌస్‌కీపింగ్ చేసే మహిళలు కలిసి అంబేడ్కర్ హౌస్ కీపింగ్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు కాంట్రాక్టు గడువు ముగియడంతో హౌస్‌కీపింగ్ పనుల కాంట్రాక్టును తమకే ఇవ్వాలని రెండు నెలలుగా అధికారులను అడుగుతున్నారు. అయితే కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ గడువును నెల రోజుల పొడిగించి మరో పెద్దకాంట్రాక్టర్‌ను తెరమీదకి తెచ్చి సెక్యూరిటీ గార్డ్ కాంట్రాక్టర్‌కే సబ్ కాంట్రాక్ట్ ఇచ్చే యోచనలో ఒక అధికారితో పావులు కదపడం మహిళలను ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై పీజీఆర్ఎస్‌లో విన్నవించినా దానిని పక్కదారి పట్టించారు. ఆపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఏడేళ్లుగా పనిచేస్తున్న మహిళలకు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. అయితే అధికారులు మాత్రం పెద్ద కాంట్రాక్టర్‌కు ఈ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టాలని ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది.ఇప్పటికైనా కమిషనర్ రాహుల్‌మీనా దీనిపై స్పందించి ఏడేళ్లుగా హౌస్‌కీపింగ్ పనులు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని మహిళలు ఎదురు చేస్తున్నారు.

రైతులు అధైర్యపడవద్దు

కడియం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్‌తో కలిసి కడియం ఆవ ప్రాంతాన్ని పరిశీలించారు రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు.

శుభ్రతపై దృష్టి సారించాలి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని నిత్యం పరిశుభ్రంగా వుంచేందుకు ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా సూచించారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక వీఎల్ పురం పరిసర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్మికుల హాజరు పట్టి పరిశీలించారు. ఎన్ని గంటలకు హాజరవుతున్నారని ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పారిశుధ్య పనులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు.రోడ్లపై వ్యర్థాలు ఉండటానికి వీల్లేదని, కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులు కావాల్సిన పనిముట్లు అందజేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

గంగమ్మ ఆలయానికి రూ.1,00,116 విరాళం



కడియం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బుర్రిలంక గ్రామంలో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి కడియపులంక ఉపసర్పంచ్ పాటంశెట్టి వెంకటరామారావు (రాంజీ) రూ.1,00,116 విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, గెడ్డం శివ, కట్టా శివ, వారా నాగేష్, పట్టా బాలు, అయితిరెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

గోశాలకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయుడుపాకల గ్రామంలో ఋషిర్బృహ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదశ్రౌత పాఠశాల గోశాలకు శంకుస్థాపన జరిగింది. సూర్యనారాయణ భగవానుడి ఆశీస్సులతోపాటు తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు శిష్టు సుబ్రహ్మణ్యశాస్త్రి, అన్నవరం దేవస్థానం ఆలయ సలహాదారులు చతుర్వేదీయులు బ్రహ్మశ్రీ కపిలవాయి రామశాస్త్రి,ఎస్పీ సెంధిల్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారని నిర్వాహకులు చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



అనపర్తిలో అధికారుల సమీక్షా సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. తుఫాను ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమ, మంగళవారాల్లో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్, తాగునీరు, రవాణా తదితర సేవల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైతేనే బయటకు రావాలని, ముందుగానే నిత్యావసరాలు సమకూర్చుకోవాలని సూచించారు.నగరంలో డివిజన్ ఇన్‌చార్జిలు తమ పరిధిలో ఏదైనా సమస్య ఏర్పడితే తక్షణమే స్పందించి అధికారులకు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అధికారులు సమష్టిగా పనిచేయాలి

అనపర్తి అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా సమష్టిగా పనిచేయాలని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సమాచారాన్ని మండల కేంద్రానికి చేరవేయాలన్నారు. సహాయక చర్యలో పాల్గొనేందుకు పోలీసులు, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో నాగలత, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాఠశాలలకు రెండు రోజులు సెలవులు

రంగంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమ, మంగళవారం సెలవు ప్రకటించినట్టు ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు ఆదివారం తెలిపారు. ప్రైవేటు మేనేజ్‌మెంట్‌వారు ఎవరైనా ఈ రెండు రోజుల్లో స్టడీక్లాసులు, అదనపు తరగతుల పేరుతో పాఠశాలలు నిర్వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే భద్రత చర్యల నిమిత్తం ఎంఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తుఫాను కారణంగా ప్రజలకు ఎటువంటి సహాయం అవసరమైనా ఎంఈవో-1: 94918 61761, ఎంఈవో-2: 98480 67223, రంగంపేట క్లస్టర్: 90005 45353, ఈలకొలను క్లస్టర్: 94949 57268, సింగంపల్లి క్లస్టర్: 96666 27449, ఎంఈవో కార్యాలయం: 63013 03014, 89851 60405 నెంబర్లుకు ఫోన్ చేయాలని ఎంఈవోలు పేర్కొన్నారు.



కూటమి ముఖ్యనాయకులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ప్రజాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం

పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే వాసు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఎమ్మెల్యే వాసు పుట్టిన రోజు వేడుకల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయానికి వేలాది మంది కార్యకర్తలను, నాయకులు వచ్చి ఆయనకు బొకేలు, మొక్కలు, శాలువాలు, జ్ఞాపికలతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆదిరెడ్డి వాసు కట్ చేశారు. అనంతరం భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 11 మందికి విద్య, వైద్యం నిమిత్తం రూ.70 వేలు అందించారు. అలాగే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి నాలుగు వీల్‌ఛైర్లు,ముగ్గురు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందించారు. 36 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్‌లను పంపిణీ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో వేయి మంది మహిళలకు చీరలు పంచారు. మల్లికార్జున నగర్‌లో భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో రూపొందించిన పార్కును, జిమ్ పరికరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా వాసుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర, కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, శెట్టి జగదీష్, కొయ్యల రమణ, నక్కా చిట్టిబాబు, నక్కా దేవి వరప్రసాద్, సీఐలు అప్పారావు, బాజీలాల్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

దళితులను 2వ తరగతి పౌరులుగా చూస్తున్నారు

మాజీ ఎంపీ హర్షకుమార్



కోరుకొండలో మాట్లాడుతున్న హర్షకుమార్

కోరుకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలోను, రాష్ట్రంలోను దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. కోరుకొండలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులతో కలిసి హర్షకుమార్ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాడాల గ్రామంలో మధురపూడికి చెందిన పాముల శ్రీనుపై దాడిన చేసిన నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. కందుకూరిలో జరిగిన సంఘటనకు ప్రభుత్వ పెద్దలందరూ వెళ్లారని కానీ గాడాలలో దళిత యువకుడిని స్తంభానికి కట్టి కొట్టినా ఏ ఒక్కరూ స్పందించలేదని హర్షకుమార్ ఆరోపించారు.చంద్రబాబు పాలనలో దళితులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.అనంతరం కొద్దిసేపు జాతీయ రహదారిపై బైఠాయించి దళితులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఆపై కోరుకొండ బస్టాండ్ నుంచి ర్యాలీగా నార్త్‌జోన్ డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ వై.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు నక్కా రాంబాబు, మార్టిన్ లూథర్, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా కలశోత్సవం

రాజానగరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యో): అయ్యప్ప పడిపూజలో భాగంగా రాజానగ రంలో ఆదివారం కలశోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్థానికుడు గ్రంధి రమేష్ అయ్యప్ప మాలధారణ దీక్ష 18 పర్యాయాలు పూర్తయిన సందర్భంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఉదయం గణపతి హోమం జరిపారు. అనంతరం మహిళా భక్తులు 108 మంది కలశాలను శిరస్సుపై ధరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటంతో పాటు గుర్రపు బగ్గీపై గురుస్వాములు ఆసీనులై గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప, శివ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బిక్కవోలులో మూడు పునరావాస కేంద్రాలు

బిక్కవోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్‌లు ఆదివారం తెలిపారు. వీటిని బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశామని, ఒక్కో కేంద్రంలో 250 మంది ఉండవచ్చునన్నారు. మండలంలో 20 సెల్‌టవర్లు వున్నాయని, విద్యుత్ సరఫరా నిలిచిపోయినా డీజిల్‌తో పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాటర్ ట్యాంకుల్లో నీరు వుండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామని, చెట్లు పడితే తొలగించేందుకు జేసీబీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

వీర్రాజు మామిడిలో షష్ఠి ఉత్సవాలకు శ్రీకారం

అనపర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు ఆదివారం రాట మంచి నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవాలకు రాటను నిలబెట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధి ఓగిరెడ్డి సత్తిరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 26న షష్ఠి సందర్భంగా 16న స్వామి వారి మాలధారణ, 24న కావడి ఉత్సవం, 26న షష్ఠి ఉత్సవం, 27న మహాన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు కాలువ దాటేందుకు పడవలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కర్రి రామారెడ్డి, మండ రాము, మండ పోతారెడ్డి, వెలగల గంగిరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, తేతల వీర్రెడ్డి, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వార్షిక సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు2 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక హోటల్ సూర్యలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా బ్రాంచి సెక్రటరీ జీవీఎస్ వరప్రసాద్, ప్రెసిడెంట్ జీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలను,వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ 5జీ అతి త్వరలో వస్తుందన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్ల వయస్సు దాటిన 35 మంది సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలిండియా సంఘ నాయకుడు చిన పాపయ్య, ఆర్ఆర్ బాలసుబ్రహ్మణ్యం, ఎం.వెంకటేశ్వరరావు, కేబీఎస్ నాయుడు, బీవీఆర్ సత్యనారాయణ, రాజగోపాలరావు పాల్గొన్నారు.

కాటవరం చెరువులో వృద్ధురాలి మృతదేహం

సీతానగరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన తెలగారెడ్డి నాగమణి(96) ఇంటి నుంచి వెళ్లిపోయి ఆదివారం స్థానిక మొండిపుంత చెరువులో విగతజీవిగా కనిపించింది. మనవడు బండారు బ్రహ్మం వివరాల ప్రకారం.. నాగమణి మతిస్థిమితం లేదు. ఈ నెల 19న ఎవ్వరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు.. బంధువులను ఆరా తీయగా ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 20న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆపై గాలింపు చర్యలు చేపట్టగా కాటవరం మొండిపుంట చెరువులో మృతదేహం ఉందని ఆదివారం సాయంత్రం స్థానికులు తెలపడంతో కుటుంబ సభ్యులు నాగమణిగా గుర్తించారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

అనపర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని పలు క్రీడలకు జరుతున్న క్రీడాకారుల ఎంపికల్లో భాగంగా ఆదివారం అనపర్తి బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో అండర్-17 బాలుర వాలీబాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ జట్టులో ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో జరిగే ఉమ్మడి తూర్పుగోదావరి డివిజన్ పరిధిలోని ఎస్‌జీఎఫ్ సెలక్షన్లలో పాల్గొంటారని స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తమ్మా
సూర్యమినీ	: ఓజీ
సూర్యప్యాలస్	: బైసన్
స్వామి	: తెలుసు కదా
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: డ్యూడ్
ఊర్వశి	: సలార్
మేనక	: తమ్మా
రంభ	: విద్రోహి
అప్సర	: కాంతారా-1
అశోక	: డ్యూడ్
వీఎస్ మహల్(నామవరం)	: కె-ర్యాంప్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: డ్యూడ్
వెంకటసూర్య(కడియం)	: కె-ర్యాంప్
సత్యగౌరి (అనపర్తి)	: డ్యూడ్
సూర్యశ్రీ (అనపర్తి)	: కె-ర్యాంప్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: డ్యూడ్
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: కె-ర్యాంప్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: తెలుసు కదా
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్





కడియం ఆవలో ఇటీవల నేలకొరిగిన చేలను పరిశీలిస్తున్న నాయకులు



ముంచుకొస్తుందా : ఉప్పాడ కొత్తపల్లిలో ముందుకొస్తున్న సముద్రం

ముప్పుందా!

పొంచి ఉన్న తుఫాన్ ముప్పు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది.. కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ముప్పు తప్పదని..110 కిలో మీటర్ల వేగంతో దూసుకొస్తోందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడి మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం రాత్రి తీరం దాటే అవ కాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారీ నష్టాలు సంభవించే ప్రమా దం ఉందన్న హెచ్చరికలతో అధికారులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. సిబ్బందిని అలర్ట్ చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్‌లో ఉన్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 110 మందిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మం డలం తూరంగిలో ఉన్న హోప్‌ఐలాండ్ కాలనీకి తరలించినట్టు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.తీర గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. బీచ్ రోడ్డుకి చేర్చి ఉన్న గృహాలను సైతం ఖాళీ చేయించారు. తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు రూ.50 లక్షలు కేటాయించారు.

విద్యుత్‌శాఖ సంసిద్ధం

ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల పర్యవేక్షణకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సీజీఎం, ఎస్ఈ, ఈఈ, డీఈఈలకు బాధ్యతలు అప్పగించారు. అత్య వసర సేవలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.పోల్స్‌ఇతర సామగ్రిని తుఫాన్ ప్రభావ జిల్లాలకు తరలించే పనిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

బీచ్ రోడ్డులో రాకపోకలు బంద్

తుఫాన్ హెచ్చరికలతో ఆదివారం సాయంత్రం నుంచి కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. బీచ్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు చేపట్టారు. వాహనాలు అటుగా వెళ్లకూడదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సముద్రస్నానానికి వెళ్లే భక్తులు బీచ్‌కు వెళ్లకూడదని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకార గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగం టాంటాం వేయించింది.

ఏజెన్సీలో అప్రమత్తం
పాపికొండల పర్యటన నిలుపుదల

దేవీపట్నం/రంపచోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా పాపికొండలు పర్యటన తాత్కాలికంగా నిలిపివేసినట్టు సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆదివారం తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా దేవీపట్నం మండలం పోశమ్మ గండి ఫెర్రీ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పర్యాటకులు,బోటు యాజమాన్యం, బోటు సిబ్బంది ఆదేశాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. రానున్న మూడురోజుల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉందన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 630772025, 08864-243561ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యా సంస్థలకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 28, 29 తేదీల్లో సెలవులు ప్రకటించారు.



హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

బడులు బంద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కాకినాడ జిల్లాకు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు విద్యాశాఖాధికారులు సెలవులు ప్రకటించారు. కోనసీమ , తూర్పుగోదావరి జిల్లాలకు 27,28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోను తదుపరి సమాచారం ఇచ్చే వరకు పాఠశాలలను తెరవొద్దని ఆదేశించారు. ఉపవిద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులన్నీ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని పాఠశాలలను తుఫాన్ పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేస్తున్నారు.హాస్టళ్లలోని విద్యార్థులను ఇళ్లకు పంపేశారు.అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగులకు సెలవుల్లేవు..

ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. అతి పెద్ద తుఫాన్‌గా వాతావరణశాఖ హెచ్చరించడంతో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని, తుఫాన్ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, నష్ట నివారణ లేకుండా సన్నద్ధం కావాలని అధికారులు ఆదేశి స్తున్నారు. రానున్న నాలుగు రోజులూ ఎటువంటి సెలవులు ఉన్నా.. వాటిని రద్దు చేసుకుని విధులకు తప్పకుండా హాజరుకావాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశారు.

- ఉమ్మడి జిల్లాలో రేపు అలజడి
- కాకినాడలో తీరం దాటే అవకాశం
- యంత్రాంగాలు అప్రమత్తం
- మూడు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- బీచ్‌కు రాకపోకలు బంద్
- స్కూళ్లు, కాలేజీలకు సెలవులు
- ఉద్యోగుల సెలవులు నిలుపుదల
- ఇళ్లకు తరలిన హాస్టల్ విద్యార్థులు
- ఏజెన్సీలోనూ అప్రమత్తం
- పాపికొండల పర్యటనకు బ్రేక్
- ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు

తుఫాన్ వస్తే ఏం చేయాలి..

- అధికారుల సమాచారం కోసం మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసర ఎస్ఎంఎస్‌లను చూడాలి. సమాచారాన్ని గుర్తించాలి. ప్రమాదకరంగా ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి.
- అధికారుల సూచనల ప్రకారం సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.
- పుకార్లు, వదంతలు నమ్మకూడదు.
- బయటకు వెళ్లకూడదు. ప్రమాదకర ప్రాంతాలకు అసలు వెళ్లకూడదు. పాతభవనాలు, చెట్లు, విద్యుత్‌వైర్లు వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- భారీవర్షాల సమయంలో ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ఛాఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రిక్ గృహోపకరణాలను ప్లగ్ నుంచి తీసేయండి.
- మత్స్యకారులు వేటకు వెళ్లకూడదు.
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భవనాలపై సెల్ టవర్లు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అవి కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అనుమానం ఉంటే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి.
- అత్యవసర సహాయ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లను సంప్రదించాలి.

1996 తుఫాన్ తలచుకుని..

- భయపెడుతోన్న మొంథా
- ఆందోళనలో ప్రజానీకం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ భయపెడుతోంది. గోదావరి జిల్లాలను ముంచేస్తుందనే ఆందోళన మొదలైంది.1996 నవంబరు తుఫాన్ తలచుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం జోనల్, జిల్లాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. జోనల్ అధికారిగా ఐఏఎస్ అధికారి అజయ్‌జైన్, జిల్లా ప్రత్యేకాధికారిగా ఐఏఎస్ అధికారి కె.కన్నబాబును నియమించింది. మొంథా తుఫాన్ ఎదుర్కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో ఆయన తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు తెలియజేయాలన్నారు.అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి,నిత్యావసరాలు, మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా, సహాయక చర్యలపై యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలన్నారు.

జిల్లాలో రెడ్ అలర్ట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఎస్‌డీఎంఏ రెడ్ అలర్ట్‌ను ప్రకటించిందని.. జిల్లాలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ మేరకు ఆదివారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమ, మంగళవారాలు సెలవు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌ను ఈ వారం రద్దు చేసినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా డివిజన్ మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

నేడు వాతావరణంలో మార్పులు..

ఆదివారం వాతావరణం పొడిగా ఉండి,తుఫాన్ ముందు ప్రశాంతతను తలపించింది. గోపాలపురంలో మాత్రం కేవలం 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.మిగతా ప్రాంతాల్లో పొడిగా ఉంది. రాత్రి 7 గంటలకే వాతావరణంలో మార్పులు వచ్చి, స్వల్పంగా చలిగాలులు ఆరంభమయ్యాయి.సోమవారం నాటికి వాతావరణం మరింతగా మార్పులు వచ్చి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ హెచ్చరించింది. మంగళ, బుధవారాల్లో అతిభారీ వర్షాలు సంభవించే అవకాశం ఉన్నట్టు స్పష్టం చేసింది.భారీ వర్షాల వల్ల పల్లపు ప్రాంతాలు మునిగే అవకాశం ఉంది.

అట్టర్..ప్లాట్లు!

- అంచనాలు తలకిందులు
- అంతంతమాత్రమే స్పందన
- ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు
- మళ్లీ గడువు పొడిగించేనా?

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఇచ్చిన 90 రోజులు గడువు ముగిసింది. గతంలో అవకాశం ఇచ్చినా అర్థంతరంగా నిలిపివేసింది. ఈ సారి పూర్తిస్థాయిలో 90రోజులు గడువిచ్చినా పథకానికి తొలినుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలోని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా), తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా), బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ అర్థంతరంగా నిలిపివేసి దీనికి కొన్ని సవరణలు చేసి 2025, జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 134ను 2025, జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.ఆ గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.

మొక్కుబడిగానే దరఖాస్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడడంతో పాటు స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువిస్తూ అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కాకినాడ(కౌడా) పరిధిలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో 1,005 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకు వచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే ఉన్నాయి. ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అందరూ ముందుకు రాలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మళ్లీ గడువు పొడిగించేనా?

ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా.. గడువును పొడిగిస్తుందా.. అన్న సందేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్లు యజమానుల క్రమబద్ధీకరణకు వచ్చి ఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు జమయ్యే అవకాశం ఉండేదని అధికారులు అంటున్నారు.



ఏపీ.. ఏపీ స్టార్స్!

నేటికీ కదలని నిర్మాణం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ కబ్జా నుంచి ఓ భూమిని తెలివిగా కాపాడుకున్న జైళ్ల శాఖ అధికారులు ఆపై తుప్పలకు ధారాదత్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ఓ పెద్ద అకాడమీ ఎటుపోయిందో అనే ఆందోళన తుప్పల మాటున శిలాఫలకంగా ఉండిపోయింది. నిర్మాణం మాట అటుంచితే సంబంధిత ఫైలు ఉన్నతాధికారుల వద్ద నిద్రావస్థలో ఉంది. రెండేళ్ల కిందట జరిగిన తంతు కావడంతో స్థానిక అధికారులు దాదాపుగా ఆ విషయాన్ని మర్చిపోయారు. ఎవరైనా గుర్తు చేస్తే ఫైలు వెతకాల్సిన పరిస్థితికి 'ఏపీ స్టార్స్ అకాడమీ' నిర్మాణం చేరుకొంది.

ఏమిటీ అకాడమీ?

హోంశాఖ ఆధ్వర్యంలో జైళ్ల శాఖ కింద పనిచేసే ఓ చక్కటి శిక్షణ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కరణ సేవల శిక్షణ అకాడమీ (ఇంగ్లీషు పొడి అక్షరాల్లో ఏపీ స్టార్స్ అంటారు). జైళ్లలోని ఖైదీలను సంస్కరించే క్రమంలో సిబ్బంది, అధికారులు ఎంతో ఓర్పుతో నేర్పుగా పనిచేయాల్సిన పరిస్థితి ఉంటుంది. శిక్ష ద్వారా సంస్క రించడం లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో విధుల్లో మంచి ఫలితాలు సాధించే దిశగా అధికారులు, సిబ్బందిని తీర్చిదిద్దడానికి ఏపీ స్టార్స్ అకాడమీని నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ అధికారులు, సిబ్బందికి విధుల్లో సేవాభావం, ఆయుధాలు లేకపోయినా ఖైదీలను నియంత్రించడం, మానసిక పరిపక్వత, శారీరక దారుఢ్యం, ఒత్తిడిని జయించడం వంటి వాటిలో తర్ఫీదు ఇవ్వడం ఈ అకాడమీ ముఖ్యోద్దేశం. ఇన్‌డోర్, అవుట్‌డోర్ విభాగాలుగా ఫైరింగ్, కార్యాలయ సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్య శిక్షణ ఇస్తారు.

రూ.10 కోట్లతో 45 ఎకరాల్లో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఈ సంస్థ ఉండేది. రాష్ట్ర పునర్విభజన అనంతరం హైదరాబాద్ నుంచి 2015లో జీవో ఎంఎస్ నెం 121 ప్రకారం నెల్లూరులోని మూలాపేటలో ఉన్న పాత కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేశారు.సరిపడా స్థలం లేకపోవడంతో పూర్తి స్థాయిలో శిక్షణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జైళ్ల శాఖ కడప రేంజ్ పరిధిలో ఉన్న ఈ అకాడమీని రాజమహేంద్రవరానికి తరలించాలని.. పూర్తిస్థాయి భవన నిర్మాణాలు, రన్నింగ్ ట్రాక్ తదితర శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంకల్పించారు. కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ కార్యాలయం వెనుక ఉన్న 45 ఎకరాలను కేటాయించడంతో పాటు రూ.10 కోట్ల అంచనాతో పూర్తిస్థాయి నివేదికను జైళ్ల శాఖ డీజీకి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పంపించారు. దీంతో 2023 నవంబరు 15న అట్టహాసంగా శిలాఫలక ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒక్క ఇటుకను చేర్చలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చినా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో సంబంధిత ఫైలు జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో భద్రంగా నిద్దరోతోందని తెలుస్తోంది. దీంతో ఈ భూమిలో తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ ప్రదేశం డీఐజీ కార్యాలయం వెనుక ఉంటుంది. అయినా అకాడమీ విషయం జైళ్ల అధికారులు దాదాపుగా మరిచిపోయినట్లుగా పరిస్థితులు చెబుతున్నాయి.

తెరవెనుక నిజమిదే!

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి జిల్లాలోనూ ఒక వైసీపీ కార్యాలయాన్ని ఇంద్ర భవనానికి మించి నిర్మించాలని జగన్ సంకల్పించారు. ఆ పనులను రాష్ట్ర స్థాయి నేతల పర్యవేక్షణలో ఆయా జిల్లాల నాయకులకు అప్పగించారు. దీంతో స్థానిక నాయకుల కన్ను జైళ్ల శాఖకు చెందిన 50 ఎకరాలపై పడింది. అయితే రెండెకరాలు తీసుకుంటామని ప్రతిపాదించారు. దీంతో జైళ్ల శాఖ అధికారులు ఖంగుతిన్నారు. దీంతో అప్పటిక ప్పుడు ఏపీ స్టార్స్ అకాడమీ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చి ప్రభుత్వంతో మమ అనిపించుకొని శిలాఫలకం వేసేశారు. ఇలా వైసీపీ కబ్జా నుంచి ఆ భూమిని కాపాడుకున్న జైళ్ల శాఖ.. తర్వాత పట్టించుకోకుండా వదిలేసింది. సాక్షాత్తూ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ కార్యాలయం వెనుకన ఉన్న ఈ భూమి ఇటు అకా డమీ నిర్మాణానికి గానీ అటు ఏ అభివృద్ధి పనులకు గానీ నోచుకోవడం లేదు.ఈ అకాడమీ నిర్మాణం జరిగితే మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు రాజమహేంద్రవరం ఆశ్రయమిస్తుంది. ఎంతో కొంత మందికైనా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

- వైసీపీ నుంచి కాపాడుకొని నిర్లక్ష్యం
- రెండేళ్లు కావొస్తున్నా అతీగతీలేదు
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- అడుగు ముందుకు పడని వైనం
- పట్టింపులేని పాలకులు..
- మరిచిపోయిన అధికారులు
- శిక్షణ అందక జైలు సిబ్బంది ఇక్కట్లు



కొండచిలువ హల్‌చల్

సీతానగరం,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారీ కొండ చిలువ హల్‌చల్ చేసింది. గమనించిన ప్రజలు దానిని మట్టుబెట్టారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామంలోని కందుల పార్వతి ఇంటి పెరట్లో కర్రల కోసం ఒక వ్యక్తి వెళ్లాడు. కర్రలు తీస్తుండగా కొండచిలువ కనిపించింది. స్థానికులకు తెలపగా వారి అక్కడకు చేరుకుని 10 అడుగులు ఉన్న కొండచిలువను హతమార్చారు.గోదారి వరదలో కొట్టుకొచ్చి ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు.

మీ సేవలకు వందనం అన్నా.. ఎందుకమ్మా!

- 17న బదిలీ అయినా.. నేటికీ రిలీవ్ కాని వైనం
- 18న మరో ఐఏఎస్ నియామాకం
- సీటు వదలని స్పెషల్ కలెక్టర్ సరళావందనం
- ఇప్పటికీ ఇంట్లోనే పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్
- పలు ఆరోపణలతో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏం మతలబు ఉందో తెలియదు కానీ.. ప్రభుత్వం మీ సేవలకు వందనం అంటూ బదిలీ చేసినా ఆమె మాత్రం తన సీటు వదలడం లేదు.ఆమె సీట్లోకి మరో అధికారి వచ్చినా ఇంట్లో కూర్చునే ఇప్పటికీ ఫైల్స్ క్లియర్ చేయడం చర్చనీయాం శమవుతోంది. ఈ విషయమై రకరకాల ఆరోపణలు వినిపిస్తు న్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళే శ్వరం కేంద్రంగా ఉన్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎల్ఏఅండ్ ఆర్ఆర్ స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సత్తెనపల్లి సరళావందనంను ప్రభుత్వం ఈ నెల 17న బదిలీ చేసింది. పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించింది. అయితే ఆమె మాత్రం రిలీవ్ కాకుండా ఇంట్లోనే కూర్చుని పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తోంది. ఈ నెల 18న ధవళేశ్వరంలో పోలవరం ప్రాజెక్టు (ఎల్ఏఅండ్ ఆర్ఆర్) అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ (ఐఏఎస్)కు అదనపు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే బదిలీ అయిన సరళావందనం ఇంకా రిలీవ్ కాకుండా ఇంట్లోనే ఉండి అనేక ఫైళ్లను క్లియర్ చేస్తుండడం గమనార్హం. ఫైళ్ల క్లియరెన్స్‌కు కొద్దిరోజుల పాటు ఆమెకు సమయం ఇచ్చి నట్టు ఓ అధికారి చెబుతున్నారు. చాలా కాలంగా పెండింగ్ పెట్టి.. బదిలీ అయిన తర్వాత హడావిడిగా ఇంట్లోనే కూర్చుని పోలవరం భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత జనవరి లోనే ప్రభుత్వం నిధులు రిలీజ్ చేసింది. అవి చాలా కాలం లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరలేదు. ఇటీవల పునరావాస కాలనీల పునర్ని ర్మాణానికి కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సం గతి తెలిసిందే. ఆమె బదిలీ అయినా ఎందుకు రిలీవ్ కాలే దనేది ప్రశ్నార్థకంగా ఉంది.

పెద్దేవంలో ఆగని గేదెల మరణాలు

తాళ్లపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో గేదెలు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. అయినా అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం. నేటి వరకూ సుమారు 48 గేదెలు మృత్యువాతపడ్డాయి. గేదెలకు వైద్యం చేస్తున్నప్పటికీ శనివారం యండపల్లి నాగేశ్వరరావు, పోలినాటి శ్రీనివాసరావు, కేతవరపు సాయిరాంలకు చెందిన గేదెలు మృత్యువాతపడ్డాయి. గేదెలు ఎందుకు చనిపోతున్నా యన్నది నేటికీ తేలలేదు. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించా లని ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆదివారం డిమాండ్ చేశారు.



శాశ్వత అన్నదాన పథకానికి విరాళం


నిడదవోలులో విరాళం అందిస్తున్న బీజేపీ నేత వెంకటేశ్వరరావు

నిడదవోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంగిడి రోడ్డులో వేంచేసివున్న లక్ష్మీనారాయణ సహిత అష్టలక్ష్మీ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన పథకానికి ఆదివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగా వెంకటేశ్వరరావు రూ. 51,111 విరాళాన్ని ప్రకటించారు. ఆ నగదును ఆలయ కమిటీ ప్రతినిధి పూసరపు వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీలం రామారావు, పినిశెట్టి సూర్యచంద్రరావు, తోరం జయశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిక్కాలపాలెంలో కార్తీక వన సమారాధన


సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

చాగల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిక్కాలపాలెంలో బీసీ సంఘం నేత, సొసైటీ డైరెక్టర్ కేతా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు కింద దామోదరుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటుగా కూటమి నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సరదాగా గడిపారు. ప్రజల మధ్య మత సామరస్యం, సమైక్యతా భావం పెంపొందించడానికి కార్తీక వన భోజనాలు ఎంతగానో దోహదపడతాయని సొసైటీ అధ్యక్షుడు యంత్రప్రగడ అబ్బులుచౌదరి అన్నారు. కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆవపాడులో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతలు

నల్లజర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆవపాడులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (విజయవాడ) ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 22 మంది దాతలు పాల్గొన్నారు. వారికి డాక్టర్ రమణారావు కిడ్నీ, లివర్, హెచ్‌ఐవీ రక్త కణాలు, తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, టీడీపీ నేతలు అచ్యుత మధుసూదనరావు, జోగినీడు వెంకట్రావు, దొండపాటి శరత్, నిర్వాహకులు షేక్‌అబ్దుల్ ఆలీమ్, ఆది పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయం

● ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు


ఉపాధ్యాయురాలు కుసుమ, ట్రైనర్ సిరాజుద్దీన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల మానవతా దృక్పథంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. కాల్ధరి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు పులి కుసుమ వేలివెన్ను హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి, వారికి తన సొంత వ్యయంతో డిప్లమో ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో శిక్షణ ఇప్పించారు. వాటిలో వారు ఉత్తీర్ణత సాధించినందుకు గాను ఆదివారం వేలివెన్నులో శేషారావు చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన డి. ధరణి, వై. సోమశేఖర్, డి. యశశ్రీ, ఎస్. సంతోష్, ఎస్‌కె అస్మాకు శిక్షణ ఇప్పించడం జరిగింది. అనంతరం ఉపాధ్యాయిని కుసుమ, కంప్యూటర్ ట్రైనర్ ఎండీ సిరాజుద్దీన్‌ను శేషారావు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27,28,29 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ఉభయగోదావరి జిల్లాల వరకు తుఫాన్ ప్రభావం ఉంటుందన్నారు. అందువల్ల ప్రజలు వారం రోజులకు సరిపడా నిత్యవసరాలు ఇంట్లో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఏ సమస్య ఎదురైనా నేరుగా నా మొబైల్ నెంబరు 8096636666కు ఫోన్ చేయవచ్చునన్నారు. అలాగే పాడి రైతులు గేదెలు, ఆవులు, పెంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలకు ఎక్కడా ఏ ఇబ్బందులు లేకుండా అన్నిరకాలగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, బీజేపీ నేత బోడపాటి ముత్యాలరావు , తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయుడు పాకలలో ఋషిర్బ్రహ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదశ్రౌత పాఠశాల గోశాలకు శంకుస్థాపన జరిగింది. సూర్యనారాయణ భగవానుడి ఆశీస్సులతోపాటు తన తండ్రి, విశ్రాంత టీచర్ శిష్ట్లు సుబ్రహ్మణ్యశాస్త్రి, అన్నవరం దేవస్థానం ఆలయ సలహాదారులు చతుర్వేదీయులు బ్రహ్మశ్రీ కపిలవాయి రామశాస్త్రి, ఎస్పీ సెంధిల్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారని నిర్వాహకులు చెప్పారు.

ఐవీఎఫ్ రాష్ట్ర కమిటీలో కొవ్వూరు నాయకులు


నాళం శ్రీనివాసరావు ఎంబీఎస్ ప్రసాద్ గ్రంధి ప్రవీణ్

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర నూతన కార్యవర్గంలో కొవ్వూరు పట్టణానికి చెందిన ముగ్గురు ఆర్యవైశ్య ప్రముఖులకు పదవులు దక్కాయి. ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గ్రంధి గంగాధర ప్రవీణ్‌ను నియమించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు తెలిపారు. ఐవీఎఫ్ రాష్ట్ర కమిటీలో పదవులు పొందిన నేతలకు కొవ్వూరు పట్టణ, మండల ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

కోడిపందేలు వేస్తే కఠినచర్యలు


అట్లపాడులో కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

నిడదవోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేలు నిర్వహించినా ... పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎల్. బాలాజీ సుందరరావు అన్నారు. ఆదివారం అట్లపాడులో కోడిపందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోళ్లు, ఒక బైక్, రూ.1470 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కర్ణాటకలో ఎమ్మెల్యే మద్దిపాటికి ఘన సత్కారం


సింధనూర్‌లో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కాకతీయ క్లబ్ సభ్యులు

గోపాలపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలుగువారు దిక్సూచీ కావాలని స్వర్గీయ ఎన్టీఆర్ ఏనాడో ఆకాంక్షించారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని రాయ్‌చూర్ జిల్లా సింధనూర్ మండలంలో కాకతీయ క్లబ్ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. క్లబ్ మెంబర్లు గరికపాటి రాంబాబు, దౌలూరి శ్రీనివాసరావు, గోపాలపురం మండల టీడీపీ అధ్యక్షుడు కొర్లపాటి రాము, జిల్లా రైతు కార్యదర్శి జ్యేష్ఠ శ్రీనివాసరావు, ఇల్లూరి రాము, మద్దిపాటి రమేశ్, జగదీశ్, బల్లారెడ్డి చంద్రశేఖర్, మగ్బూల్ బాష పాల్గొన్నారు. ఫౌండర్ తాళ్లూరి సుబ్బారావు, ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నల్లజర్లలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నల్లజర్ల అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు ఆదివారం తెలిపారు. దీనికోసం తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అవసరమైనవారు ఫోన్‌నెంబర్ 9491041451కు ఫోన్ చేసి సాయం కోరవచ్చునన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదన్నారు.

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు : సీఐ


కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టయితే చర్యలు తప్పవని కొవ్వూరు పట్టణ సీఐ పీ.విశ్వం హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ డీ.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ జీ.దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు సబ్ డివిజన్ శక్తి టీమ్ ఇన్‌చార్జి గంగాధరరావు ఆధ్వర్యంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాల నివారణలో భాగంగా విద్యార్థులతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్‌ఐ జీఆర్‌కే గంగాధరరావు, సిబ్బంది భవాని, పద్మ, బీసీ హాస్టల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ



నిడదవోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ వారిని ఆదివారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకు న్నారు. అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితాపారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోలింగేశ్వరుడికి లక్షపత్రి పూజ


నిడదవోలులో విశేష పూజలందుకున్న గోలింగేశ్వరస్వామి

నిడదవోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వేంచేసి యున్న రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి గణపతి పూజ, ఉపన్యాస పూర్వక రుద్రాభిషేకం, స్వామివారికి అభిషేకాలు, లక్షబిల్వార్చన, లక్షకుంకుమార్చన, మహిళలచే లలితాసహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నామా సూర్యప్రకాశరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ మోటార్ల అపహరణ


కాకరపర్రులో విద్యుత్ మోటార్‌ను అపహరించిన దృశ్యం

పెరవలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్ల వైర్లను దొంగలు ఎత్తుకుపోతున్నారు. కానూరు, తీపర్రు, నడిపల్లి, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి గ్రామాల పరిధిలో అనేక మోటార్లు, విద్యుత్‌వైర్లు అపహరణకు గురయ్యాయి. కొద్దిరోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంత మేర దొంగతనాలు తగ్గాయి. మళ్లీ గత నాలుగు ఐదు రోజులుగా తీపర్రు, కాకరపర్రు పరిధిలో సుమారు పది మోటార్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క మోటారుకు మరలా వైర్లు బిగించేందుకు సుమారు రూ. పది వేలు వరకు ఖర్చు అవు తుందని వాపోతున్నారు. ఇకనైనా పోలీసులు దొంగలపై నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న ఏఈ డేవిడ్ నిశ్చల్

పెరవలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఈ డేవిడ్‌నిశ్చల్ పేర్కొన్నారు. ఆదివారం విద్యుత్ శాఖ సిబ్బందితో సబ్ స్టేషన్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. తుఫాన్ ప్రభావం జిల్లా పై ఎక్కువగా ఉంటుందని వార్తలు వస్తుండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా స్థంభాలు పడిపోతే వాటి స్థానంలో కొత్తవి అమర్చడానికి చర్యలు చేపట్టాలని సిబ్బందిని సూచించారు.

అక్రమంగా పశువులు కబేళాకు తరలింపు



రాయవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎద్దులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్‌ఐ డి.సురేష్ బాబు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కాకి నాడ జిల్లా జగ్గంపేట సంత నుంచి డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి అక్కడి నుంచి ఐషర్ వ్యాన్‌లో నెల్లూరుకు అక్రమంగా 16 ఎద్దులు, 14 దూడ లను తరలిస్తుండగా రాయవరం పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. రామచంద్రపురం శివారు కొత్తురుకు చెందిన సంసేను, రామచంద్రపురానికి చెందిన వెట్రివేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. టీఎన్ 66ఏబీ 8740 ఐషర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎద్దులు, దూడలను సామర్లకోట గోశాలకు తరలించి వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఒడిశా టు కోయంబత్తూరు

● 172 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టివేత
● దీని విలువ రూ. 8 లక్షల పైమాటే..
● ఆటో, లారీ సీజ్... ముగ్గురిపై కేసు


నిందితులతో పాటు గంజాయి, లారీని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా ప్రాంతం నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తూర్పుగోదావరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్. లావణ్య తెలిపారు. కొవ్వూరు గామన్ వంతెన దిగువన దొమ్మేరు రోడ్డులో ఆటో నుంచి లారీలోకి గంజాయి ఎక్కిస్తున్నారని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తీసుకువచ్చిన ఆటో, రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేసి 86 ప్యాకెట్లలో ఉన్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి డొంకరాయికి చెందిన ఆటోలో డ్రైవర్ గంజాయిని కొవ్వూరు తీసుకువచ్చాడు. ఇక్కడి నుంచి కొయంబత్తూరుకు తరలించేందుకు లారీలో ఎక్కిస్తుండగా డొంకరాయికి చెందిన ఆటో డ్రైవర్, తమిళనాడుకు చెందిన లారీడ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డి.అప్పారావు, రవిశంకర్, ఐఎన్ఎస్.బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ


అన్నవరంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు, రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 3 గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. ఆదివారం సుమారు 5వేల జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో ఆలయంలో నిబంధనలను కఠినంగా అమలుచేశారు. పశ్చిమ రాజగోపురం వద్ద చిన్నద్వారాన్ని మూసివేశారు. సిబ్బంది తరుపున వచ్చినవారిని కూడా జనరల్ క్యూ లైన్ ద్వారానే అనుమతించారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం వెనక భాగంలో ఉండి దళారులు ఎవ్వరూ దరిచేరకుండా పర్యవేక్షణ చేశా రు. ఈవో సుబ్బారావు ప్రధానాలయం, వ్రతమండపాల వద్ద రద్దీ నియంత్రణకు ఆదేశాలిచ్చారు. వాహనాలను నిర్దేశితప్రాంతంలో మాత్రమే పా ర్కింగ్‌కు అనుమతించారు. సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా సుమారు 6వేల మందికి ఉచిత పులిహోర దద్దోజనం అందించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు రథంవెంట నడి చి స్వామిసేవలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో..


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఆది వారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి గణపవరానికి చెందిన కొండేటి వెంకటరత్నం రూ.30,116.. రాజమహేంద్రవరానికి చెందిన భూపతిరాజు సాయిశరత్‌వర్మ రూ. 36,500 విరాళాలు సమర్పించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ శ్రీరామ రాహుల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు అందించారు. వారికి అర్చక బృందం వేద మంత్రాలతో స్వాగతం పలకారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.


రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ దంపతులకు చిత్రపటం అందిస్తున్న డీసీ

న్యూడెమోక్రసీ పార్టీలో చేరడం శుభపరిణామం


నిడదవోలులో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత గ్రీష్మకుమార్

నిడదవోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మోదీ, షా అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జరుగుతున్న పోరాటంలో న్యూడెమోక్రసీ పార్టీలోకి పలువురు రావడం శుభపరిణామమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నేత ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. ఆదివారం నిడదవోలులో జరిగిన విలేకర్ల సమావేశంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు మెరిపో జాన్‌రాజ్, గెడ్డం రవీంద్రబాబు ఆ పార్టీకి రాజీనామా చేసి న్యూడెమోక్రసీ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మెరిపో జాన్‌రాజ్, గెడ్డం రవీంద్రబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల పీడిత ప్రజల ప్రయోజనాల కోసం నూతన సమాజ నిర్మాణం కోసం జరిగే పోరాటంలో భాగస్వామ్యం అయ్యేందుకే న్యూ డెమోక్రసీ పార్టీలో చేరామన్నారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల నాయకులు పామర్తి సత్యనారాయణ, రవ్వా సురేష్‌కుమార్, మల్లి రామిరెడ్డి, తూరుగోపు వెంకటేశ్వర్లు, కండవల్లి వెంకట్రావు, కొమ్మోజు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పాఠ్య పుస్తక రచయితగా శిరీష ఎంపిక



గోకవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పిట్టా శిరీషకుమారి రాష్ట్రప్రభుత్వ పాఠ్య పుస్తక రచయితగా ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈవో కె.వాసుదేవరావు నుంచి ఆదివారం తనకు ఉత్తర్వులు అందినట్టు శిరీషకుమారి తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 8మంది ఉపాధ్యాయులు వివిధ సబ్జెక్టుల రచయితలుగా ఎంపికవ్వగా గోకవరం మండలం నుంచి శిరీషకుమారి తెలుగు పాఠ్య పుస్తక రచయితగా ఎంపికయ్యారు. ఈమె గతంలో 8వ తరగతి పాఠ్య పుస్తకం రూపొందించడంలో పని చేశారు. ఈ నెల 27 నుంచి నవంబరు 1 వరకు విజయవాడ ఎస్‌జే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరిగే వర్క్ షాప్‌లో ఈమె పాల్గొననున్నారు. శిరీషకుమారి ఎంపిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

రాజమండ్రి కార్పొరేట్ క్రికెట్ కప్ సీజన్-3 ప్రారంభంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదపడతాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వాహకుడు బాలాజీ, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని నిలువెత్తు నిదర్శనంగా ఏఎస్పీ చెంచు రామయ్య అని అన్నారు. స్పాన్సర్ ప్రముఖ సినీ ప్రొడ్యూసర్ సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్‌వాట్ కొమ్ము మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో రాజకీయ రంగం నుంచి టీమ్ లేకపోవడం వెలితిగా ఉందన్నారు. వచ్చే టోర్నమెంట్‌లో డాక్టర్స్, పొలిటికల్ టీమ్‌లు పాల్గొనే ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, గురునాథం,డాక్టర్ కృష్ణతేజ, సాయి, కొండవీటి ప్రభాకర్, జామి సత్యనారాయణ బాలాజీ, సాయి పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై ఫార్మాసిస్ట్‌లకు శిక్షణ

కోరుకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫార్మసీ సదస్సు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్‌పై శిక్షణను అసోసియేషన్ వాక్సినేషన్ ప్రాజెక్ట్ అధికార ప్రతినిధులు డాక్టర్ రాజవైద్య, గోవా, కమ్యూనిటీ ఫార్మాసిస్ట్ మానసి జోషి, క్లినికల్ ఫార్మసీ టీచర్ ప్రాక్టీషనర్, వ్యాక్సినేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బోధకులకు శిక్షణ ఇచ్చారు. ఐదేళ్లుగా డాక్టర్ టీవీ నారాయణ, సౌత్ ఈస్ట్ ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ, ప్రెసిడెంట్, అంతర్జాతీయ ఫార్మసీ సదస్సు అధ్యక్షులతో జరిపిన చర్చలు, కృషి ఫలితంగా ఈ కార్యక్రమాన్ని భారతదేశానికి అధికారికంగా మంజూరు చేయించారు. శిక్షణ తీసుకున్న ఫార్మసిస్టులు, డాక్టర్లు, నర్సుల పర్యవేక్షణలో వ్యాక్సిన్ చేసేందుకు అర్హత పొందుతారు. శిక్షణ పొందిన వారికి యోగ్యత పత్రాలను డాక్టర్ రాజ్ వైద్య,డాక్టర్ మానసిజోషి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తన్నీరు చిన్న సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ టీవీ నారాయణ, సెక్రటరీ డాక్టర్ భరత్ వికాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.మురళీధర్, పి.వాసుబాబు,డాక్టర్ వి.సతీష్ కుమార్, డాక్టర్ మాధురి శ్రీకర్ పాల్గొన్నారు.

మూగమనసులు చిత్రం 60 వసంతాల వేడుక

● సుబ్బారావు, జిత్‌మోహన్, ఎస్.మల్లికార్జునరావుకు అక్కినేని అవార్డులతో సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన నటించిన మూగమనసులు చిత్రం 60 వసంతాల వేడుకను స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం నిర్వహించారు. అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమానికి జిత్‌మోహన్ మిత్ర ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతీయ సినిమా పరిశ్రమలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, రాజమహేంద్రవరానికి చెందిన వారన్నారు. గోదావరి అందాలను తొలిసారిగా తెరకెక్కించిన ఘనత ఆదుర్తికే చెందుతుందని, అప్పటినుంచీ గోదావరి తీరంలో ఎన్నో చిత్రాలు నిర్మితమవుతున్నాయన్నారు. జిత్‌మోహన్, సుబ్బారావు, ఎస్.మల్లికార్జునరావులను అక్కినేని అవార్డులతో సత్కరించారు. ఎస్.శ్రీనివాస్, గిరిజాల సోమరాజునాయుడు, ఏఎస్ ఆనంద్, కృష్ణ, సూర్యప్రకాశరావు, ఏకే దత్తాత్రేయ శర్మ, కె.రామ్మోహనరావు, సత్యకృష్ణ, రాఘవరావు పాల్గొన్నారు.